ప్రజాశక్తి
శనివారం 8 జులై 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





పట్టు తప్పుతున్న పాలన



- కార్యాలయాల్లో పైకి..
  కిందకు.. వెళుతున్న ఫైళ్లు
- అధికారులకు, ప్రజాప్రతినిధుల
  మధ్య సమన్వయం ఎండమావే..
- సమస్యలు పరిష్కారం కావడం
  లేదని ప్రజాప్రతినిధుల్లోనే అసంతృప్తి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

క్షేత్రస్థాయిలో అధికారులు తమకు కనీసం విలువ కూడా ఇవ్వడం లేదని.. ప్రోటోకాల్ పాటించడం లేదని మండల ప్రజాప్రతినిధులు ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో గగ్గోలు పెట్టారు. తమకు సరైన గుర్తింపు కూడా లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపైనే అసంతృప్తులు.. ఆగ్రహాలు.. ఆవేదనలు.. ఇలా అనేక రూపాల్లో తమ అభిప్రాయాలను వెల్లడించారు. నిజంగా జరుగుతున్నదే ఇదీ.. గతంలో దర్శిలో ఓ అధికారి తన విషయంలోనే ప్రోటోకాల్ పాటించలేదని స్వయంగా జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారిని కూడా నిలదీశారు. ఇప్పుడూ అన్ని మండలాల్లో ఇదే జరుగుతోంది. కారణం ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య సమన్వయం లేదు. సమస్యలపై ఏకాభిప్రాయం లేదు. పాలన దాదాపుగా పట్టు తప్పిందనే చెప్పాలి. క్షేత్రస్థాయిలో ▶ 2లో

గర్భిణీపై వైసిపి నేతల దాడి

- 'సురక్ష'లో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ
- కుర్చీలు విసిరేసుకున్న వైనం

▶ 8లో

అక్రమాలను అడ్డుకోవాలంటే..

వణికిపోతున్నారు..

- యథేచ్ఛగా గ్రావెల్
  అక్రమ రవాణా
- అడ్డుకొనే అధికారులకు
  అధికారపార్టీ నేతల
  బెదిరింపులు
- నిస్సహాయ స్థితిలో
  రెవెన్యూ అధికారులు



మర్లపాడు కొండ ప్రాంతంలో జేసీబీతో ఎర్ర మట్టిని టిప్పర్‌కు లోడు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-టంగుటూరు

సాధారణంగా అక్రమార్కులు అధికారులను చూసి భయపడుతుంటారు. తాము ఏదైనా అక్రమ రవాణా చేయదలచుకుంటే అధికారులకు తెలియకుండా గుట్టుగా చేస్తుంటారు. కానీ టంగుటూరులో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా అక్రమాలను అడ్డుకోవాలంటే అధికారులే వణికిపోతున్నారు. గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా.. వాటిని ఆపేందుకు భయపడుతున్నారు. అక్రమార్కుల వెనుక జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి ఉండటమే అధికారుల్లో భయానికి కారణం.

ఇటీవల జరిగిన ఓ సంఘటన మైనింగ్ మాఫియా బరితెగింపుకు అద్దం పడుతోంది. కొద్దిరోజుల క్రితం ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో మైనింగ్ అధికారులు కందులూరు గ్రామానికి వెళ్లారు. అక్కడ లోడు చేసిన ఎర్రమట్టి టిప్పర్‌ను జేసీబీతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న మైనింగ్ అధికారులు టంగుటూరుకు తరలిస్తున్నారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తి మట్టి రవాణా వాహనాలకు తన కారును అడ్డుగా పెట్టి ఎలా ముందుకెళతారో వెళ్లండంటూ రెవిన్యూ, మైనింగ్ ఉన్నతాధికారులపై దాడి చేసినంత పనికి దిగాడు. ఇదంతా జిల్లాకు చెందిన ప్రముఖ ప్రజా ప్రతినిధి అండతోనే జరుగుతుండటంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు సైతం తిరిగి ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. జిల్లా ప్రజాప్రతినిధి అండతో జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు పొందిన కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా మైనింగ్ మాఫియాకు పాల్పడుతున్నారు. దీని వల్ల ఆయా గ్రామాల చుట్టుపక్కల ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయి భవిష్యత్తులో తీవ్రమైన నీటిఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు పొందిన వారు మండలంలో మైనింగ్ మాఫియాగా ▶ 2లో



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

కార్పొరేట్ శక్తులను తరిమేందుకు

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమవ్వాలి

- అఖిల భారత కిసాన్
  సభ జాతీయ ప్రధాన
  కార్యదర్శి విజ్జూకృష్ణన్
- స్వామినాథన్ సిఫారసుల
  అమలు శరణ్యం
- సెమినార్‌లో వక్తల వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులను తరిమికొట్టేందుకు మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలందరూ సిద్ధం కావాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. జిల్లాలోని ఒంగోలు బృందావన్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగ సంక్షోభం-పరిష్కార మార్గాలు అనే అంశంపై సెమినార్ శుక్రవారం జరిగింది. సెమినార్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాల నరేంద్ర మోడీ పాలనలో అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి రైతులను నిలువునా మోసం చేశారన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులలో రైతులకు సబ్సిడీలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పిందని, విత్తనాలు, ఎరువులు కంపెనీలు చెప్పినట్లు వినడం తప్ప వాటిని నియంత్రించే స్థితిలో కేంద్రం లేదన్నారు. 1995-2014 వరకు దేశంలో మూడు లక్షల మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నట్లు నేషనల్ క్రైం బ్యూరో నివేదికలు చెబుతున్నాయన్నారు. మోడీ అధికారంలో ఉన్న 2014-2023 వరకు అప్పుల బాధలు, రుణాలతో, వలస కార్మికులకు పనులు లేక సుమారు నాలుగు లక్షల మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను అమలు చేసే నాథుడు లేడన్నారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు రైతులు పెట్టిన పెట్టుబడులకు అదనంగా 50 శాతం ఇవ్వటం ద్వారా వ్యవసాయం, రైతులు సంక్షోభం నుంచి గట్టెక్కుతారని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులలో ▶ 2లో

విద్యార్థినులను వేధించే

ఆకతాయిలపై నిఘా ఉంచాలి

ఎస్పీ వకుల్‌జిందాల్



ఇంకొల్లు సిఐ సూర్యనారాయణకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కాలేజీలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయంలో విద్యార్థినులను వేధించే ఆకతాయిలపై నిఘా ఉంచాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశం హాలులో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ నెలవారీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. కేసులలో పోలీస్ అధికారులు చేసిన దర్యాప్తును పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు తీసుకోవలసిన చర్యలను గురించి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను చెప్పుకోవడానికి ముందుగా పోలీస్‌స్టేషన్‌కు రావడానికి ప్రధాన కారణం పోలీసులు ప్రజల సమస్యలపై వేగంగా స్పందిస్తారనే కారణంతోనే అని, కనుక ఫిర్యాది పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ ఇచ్చినప్పుడు వారి పట్ల స్పందించే విధానం, వారు ఇచ్చిన రిపోర్ట్‌పై తీసుకునే చర్యలు అత్యంత కీలకమన్నారు. ఫిర్యాది రిపోర్ట్‌పై వెంటనే కేసు రిజిస్ట్రేషన్ చేసి విచారణ చేయాలన్నారు. ఏదైనా చిన్న ఘటన జరిగినా దాని పట్ల అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కాలేజీలు, పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని ఆడపిల్లలను, మహిళలను వేధించే ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళా కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలపై దష్టి సారించాలన్నారు. నేర సమీక్షా సమావేశం ముగిసిన అనంతరం ఎక్కువ సంఖ్యలో దిశ యాప్ లను డౌన్లోడ్ చేయించిన బాపట్ల రూరల్ సీఐ, మార్టూరు సీఐ, ఎస్ఐలను, ఇంకొల్లు సీఐ, ఎస్ఐలను అద్దంకి ఎస్సై ఆదిలక్ష్మిలను, కేసుల పెండెన్సీ తగ్గించిన చందోలు ఎస్సై, సంతమాగులూరు ఎస్సైను, డయల్ 100 కాల్‌కి వేగంగా స్పందించిన చోడాయపాలెం ఎస్సైను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె డి.ఎస్.పిలు టి.వెంకటేశ్వర్లు, ఎస్.ప్రసాద్‌రావు, టి.మురళీకష్ణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ ఏ.వి రమణ, డి.ఎస్.బి ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ పి.బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

వణికిపోతున్నారు..

(మొదటిపేజీ తరువాయి)

మారారు. ఎంచక్కా ఒంగోలు, తాడేపల్లి చుట్టూ కాలర్ ఎగరేస్తూ చక్కర్లు కొడుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టి తవ్వకాలు.. అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్నారు. మండలంలోని కందులూరు, మర్లపాడు, కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం ప్రాంతాలలో దాదాపు వెయ్యి ఎకరాల పరిధిలో కొండ ప్రాంతం విస్తరించి ఉంది. మర్లపాడులోని 388 సర్వేనెంబర్‌లో 391 ఎకరాలు, కందులూరులోని 420 సర్వే నెంబర్‌లో 105 ఎకరాలు, కొణిజేడులోని 769వ సర్వేనెంబర్‌లో 391 ఎకరాలతో పాటు మండల పరిధిలో విస్తరించి ఉన్న సర్వేరెడ్డిపాలెంలో మరో 100 ఎకరాలలో మొత్తం రమారమి వెయ్యి ఎకరాలలోని కొండ ప్రాంతంలో ఎర్ర బంగారంగా పిలవబడే గ్రావెల్ విస్తరించి ఉంది. మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేనప్పటికీ మండలానికి చెందిన ముగ్గురు ప్రముఖులు రాజకీయ అండతో రాత్రింబవళ్లు జేసీబీలతో మట్టిని టిప్పర్లకు లోడ్ చేస్తూ దూర ప్రాంతాలకు తరలించి రూ.కోట్లకు పడగెత్తుతున్నారు. అధికారుల దాడులలో అప్పుడప్పుడూ వాహనాలు పట్టుబడినా వారికి వేసే జరిమానా కేవలం ఒక టిప్పర్ మట్టితో సమానం అని అక్రమార్కులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ గ్రామాలలోని వెయ్యి ఎకరాల కొండ ప్రాంతాన్ని గ్రావెల్ అక్రమార్కులు పెద్ద పెద్ద గుంటలు తవ్వి కొండలను సైతం ఈపాటికే నామరూపాలు లేకుండా చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఎన్నోసార్లు దాడులు చేసి.. జేసీబీ, టిప్పర్లను పోలీస్‌స్టేషన్లకు తరలించి జరిమానాలు విధించినప్పటికీ ఈ మట్టి దొంగలకు కనీసం చీమకుట్టినట్లైనా లేదు. వాహనం పట్టుబడిన వెనువెంటనే జిల్లా ప్రజాప్రతినిధి నుండి.. 'అనుమతులు ఉన్నాయి చూసుకోండి.. వాహనాలు వదిలేయండి..' అంటూ ఫోన్ కాల్స్. దీంతో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు ముచ్చెమటలు పోసుకుంటూ మరీ అక్రమార్కులకు అనుకూలంగా మారిపోతున్నారు. దీనివల్లనే మండలంలోని మైనింగ్ మాఫియాకు అధికారులంటేనే ఒక రకమైన చులకనభావం ఏర్పడింది. ఇప్పటికైనా రెవిన్యూ, మైనింగ్, పోలీస్ ఉన్నతాధికారులు మండలంలోని మైనింగ్ మాఫియాపై దృష్టి సారించి పట్టుబడిన వాహనాలను సీజ్ చేయాలి. సదరు వాహన యజమానులపై కేసు నమోదు చేయడంతో పాటు కోర్టుకు హాజరుపరిచి కఠిన చర్యలు తీసుకుంటేనే గ్రావెల్ అక్రమ రవాణాకు కొంతమేరకైనా అడ్డుకట్ట వేసినట్లవుతుందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెక్ పోస్టుల ఏర్పాటుకు చర్యలు..

బి.జగన్నాథరావు, డీడీ, మైన్స్, ఒంగోలు

టంగుటూరు మండలం పరిధిలో ఎక్కడా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు.. అనుమతులు లేవు. యరజర్ల గ్రామంలో రైతులకు చెందిన లీజు పట్టా భూమిలో ఆరు మీటర్ల లోతులో మట్టి తవ్వకాలకు మాత్రమే అనుమతులు ఇచ్చి ఉన్నాము. కందులూరు, మర్లపాడు, కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం గ్రామాలలో గ్రావెల్ అక్రమ తరలింపుపై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు అనేకసార్లు దాడులు చేసి జేసీబీలు, టిప్పర్లను పట్టుకున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. ఎన్నిసార్లు దాడులు చేసినా కనీసం అధికారులు వచ్చారన్న చలనం కూడా లేకుండా తమతో మాట్లాడుతూనే మట్టిని తవ్వి తరలిస్తున్నారు. గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కందులూరు నుండి మర్లపాడు రోడ్డులో ఒకటి, కొణిజేడు జిల్లాపరిషత్ హై స్కూల్ దగ్గర ఒకటి, యరజర్ల, వెంగముక్కలపాలెం ప్రాంతాలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే రూ.1.75 కోట్లు జరిమానా కూడా విధించడం జరిగింది. భవిష్యత్తులో గ్రావెల్ అక్రమార్కులపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కఠినచర్యలు తీసుకుంటాం.

నూతన దంపతులకు ఆశీర్వాదం

సిఎస్.పురం: మండల పరిధిలోని కోవిలంపాడు గ్రామంలో రుసుం నాగురేబాబు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సయ్యద్ దౌలత్ బాషా, గోను చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ రుసుం అహమ్మద్, అంకయ్య, రుసుం ఖాదర్, ఆర్‌ఆర్.రఫి, సయ్యద్ జిలానీ బాషా, సంగిశెట్టి పీరయ్య, సయ్యద్‌బాబు పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు సబ్సిడీలు ఇవ్వాలన్నారు. కేరళ రాష్ట్రంలో వివిధ పంటలు, కూరగాయలకు కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు. కేరళ తరహా కనీస మద్దతు ధర చట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశంలో 11 మంది బడా పారిశ్రామిక వేత్తలకు చెందిన రూ.15 లక్షల కోట్ల అప్పులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, 85 కోట్ల మంది రైతులకు సంబంధించిన 4.5 లక్షల కోట్ల అప్పులను ప్రభుత్వం మాఫీ చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని నిరుద్యోగ యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోడీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల కంటే మోడీ పాలనలో నిరుద్యోగం మరింత పెరిగిందని తెలియజేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చెప్పుకుంటున్న మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే 2024 ఎన్నికలలో ఇంటికి వెళ్లటం ఖాయమన్నారు. దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్ శక్తులను తరిమికొట్టేందుకు రెండో దశ స్వాతంత్ర్య పోరాటానికి మేధావులు, ప్రజలు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఆందోళన కార్యక్రమాలలో భాగంగా అఖిల భారత కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 28, 29 తేదీలలో రాష్ట్ర గవర్నర్ల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 10 వేల సంవత్సరాల నుంచి రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఆనాటి బ్రిటీష్ కాలంలో వారి అవసరాలకు అనుగుణంగా రైతులు పంటలు పండించారన్నారు. నేడు దేశంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడి మనుగడ సాగించాలంటే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను అమలుపరచటమే శరణ్యమన్నారు. వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడుల కోసం రైతులు బ్యాంకర్లను ఆశ్రయిస్తే దొరకటం లేదని, అధిక వడ్డీకి వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకుంటున్నారన్నారు. మార్కెట్‌లో కల్తీ, నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా దొరకుతున్నా పట్టించుకోవట్లేదన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడటానికి రైతు భరోసా కేంద్రాలు పరిష్కార మార్గమని ప్రభుత్వం చెబుతుందని, కానీ వాస్తవానికి ఈ కేంద్రాల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన విద్యుత్ సంస్కరణలను అమలుచేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, మార్చి, ఏప్రిల్ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కొత్త వంగడాలు, పంటలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. సెమినార్‌లో ఏపి కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, అధ్యక్షులు రాధాకృష్ణ, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.హనుమారెడ్డి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య ప్రసంగించారు. సెమినార్‌లో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గాలి వెంకట్రామిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, జజ్జూరి జయంతిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె మాబు, జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, రైతు సంఘం జిల్లాఉపాధ్యక్షులు అబ్బూరి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్ట పాటి చిన్నపరెడ్డి, శ్రీకాంత్, జిల్లాలోని రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

కొనకనమిట్ల : మండలంలో పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 3,470 విద్యుత్ సర్వీస్‌లను తనిఖీ చేశారు. విద్యుత్‌ను అదనంగా వినియోగిస్తున్న 13 మందిని గుర్తించి వారికి రూ.35వేలు జరిమానా విధించారు. ఈ దాడుల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆల్ఫాన్స్, విజిలెన్స్ ఇఇ టి.శ్రీనివాసరావు, పొదిలి డిఇఇ కె.శ్రీనివాసరెడ్డి, దర్శి డిఇ డికె.ఎ ్చయ్య, చీమకుర్తి డిఇ డివి.కృష్ణారెడ్డి, ఎఇలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పోయినవి

మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామ పంచాయతీలోని అక్కచెరువు తండాకు చెందిన దేశావత్ పావని, తండ్రి: సుబ్బా నాయక్ నకు చెందిన 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లు, మార్కుల జాబితా, ఇంటర్మీడియట్ ఒరిజినల్ సర్టిఫికెట్లు, మార్కుల జాబితాలు 28-06-2023న మోటార్ బైక్ పై మార్కాపురం వస్తుండగా మార్గ మధ్యలో జారి పోయినవి. 10వ తరగతి మార్కుల జాబితా నెంబర్: P499654, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా నెంబర్: R265668. వీటి కోసం వెతికినా కనిపించలేదు. ఎవరికైనా దొరికిన ఎడల తమకు అందజేయగలరని మనవి.

ఇట్లు
దేశావత్ పావని
అక్కచెరువు తండా
సెల్: 6300389776.

పట్టు తప్పుతున్న పాలన

(మొదటిపేజీ తరువాయి)

ఎవరిదారి వారిదైంది. ఎవరి సలహాలు ఎవరు పాటిస్తారనేదీ చర్చగా మారింది. సంక్షేమ పథకాలు ఇక్కడ ఎవరితోనూ సంబంధం లేకుండా నేరుగా ఖాతాల్లో పడుతున్నందున వాటిపై చర్చ లేదు. మిగతా పనులు విషయంలో ఎక్కడా పొంతన కుదరడం లేదు. మండలాల్లో అధికారులు ఏకపక్షంగానే పోతున్నారనే విమర్శలున్నాయి. నిబద్ధతతో పనిచేసే పరిస్థితి కనిపించడం లేదు. ఎమ్మెల్యేలు, మంత్రులతో సిఫార్సులు చేయించుకుని పోస్టింగుల్లోకి వస్తున్నారు. వారికి తగిన ప్రాధాన్యత ఇస్తారు. వారి పనులు చేస్తుంటారు. మండలస్థాయి ప్రజాప్రతినిధులకు మాత్రం పనులు చేయడం లేదనే చర్చ ఉంది. దీంతో క్షేత్రస్థాయి నుంచే పాలన పట్టుతప్పింది. అసంతృప్తులు తెరపైకి వచ్చాయి. అధికారులు తమ మాట వినడం లేదనే చర్చ తీవ్రమైంది. సమన్వయం పోయింది. వైరం పెరుగుతోంది. పాలన సజావుగా లేదు. ప్రజాసమస్యలపై ఏకాభిప్రాయం ఎప్పుడైతే లోపించిందో అక్కడే పొరపొచ్చాలు కూడా వస్తున్నాయి. సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి. సిబ్బందికీ, సర్పంచులకు మధ్య సమన్వయం లేదు. అంతా అధికారుల పాలనే సాగుతోంది. గ్రామ సర్పంచి, వార్డు సభ్యులకు ప్రాధాన్యత లేకుండా పోయింది. అధికారులకూ, ప్రజాప్రతినిధులకు మధ్య పరిస్థితి ఎలా ఉందో సమావేశాల్లో విదితమవుతోంది. ఇక జిల్లా అధికారుల విషయానికి వస్తే ఇక్కడా పాలన మొక్కుబడిగా ఉంది. కొత్త అధికారులు కావడంతో ఏం చేయాలన్నా జంకుతున్నారు. కార్యాలయాల్లో పాలన కూడా సజావుగా లేదు. ఫైళ్ల కింద నుంచి పైకి...మళ్లీ ఏదో సాకుతో పై నుంచి కిందకు తిరుగుతున్నాయి. మండలాల నుంచి వచ్చిన ఫైళ్లు వాతంటవ అవే క్లియర్ కావడం లేదు. ఏదో రూపంలో ఒప్పందాలు చేసుకుంటేనే ముందుకు సాగుతున్నాయనే విమర్శలున్నాయి. భూసంబంధ ఫైళ్లు ఏ ఒక్కటీ క్లియర్ కావడం లేదు. మండలాల నుంచి వెళ్లిన ఫైళ్లు అధిక భాగం జాయింట్ కలెక్టర్, ఆయనకు ముందున్న సెక్షన్లలోనే అటూ ఇటూ తిరుగుతున్నాయి. కలెక్టర్ వద్దకు చేరాలంటే నెలలు పడుతోంది. 22ఏ కింద ఉన్న ఫైళ్ల పరిస్థితి ఇదీ. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సిఫార్సులు చేయించుకుంటున్నారు. అయినా భూసంబంధమైన ఫైళ్ల విషయంలో ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. తమకు ఏదో రూపంలో ఉపయోగంగా ఉంటేనే చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు, పనులు చేసిన నేతలు ఇలా తిరుగుతూనే ఉన్నారు. స్పందన కార్యక్రమాలకు వచ్చిన అర్జీలు పరిష్కారం కూడా ప్రశ్నార్థకంగానే మారింది. జిల్లా కేంద్రంలో జరిగే స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇస్తే దాన్ని సంబంధ శాఖకు రాస్తారు. అక్కడే నిలిచిపోతోంది. మళ్లీ దాన్ని పరిశీలించడం గానీ, ఏం చేశామో చెప్పడం గానీ ఉండటం లేదు. ప్రజాసమస్యలపై దృష్టి పెట్టడం లేదు. ఒక ఫైలును వీలైనంత త్వరగా క్లియర్ చేద్దామనే ఆలోచన ఏ స్థాయిలోనూ అధికారుల్లో కనిపించడం లేదు. ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచడానికి దోహదపడుతోంది. పాలకపక్ష ప్రజాప్రతినిధులైనా దీన్ని గమనిస్తారా? అంటే అదీ లేదు. డిఆర్‌సీలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. ఇన్‌ఛార్జి మంత్రికే పట్టడం లేదు. జిల్లా మంత్రి కూడా తరచూ సమీక్షలు పెట్టి పాలనపై అధికారులను ప్రశ్నించే పరిస్థితి లేదు. దీంతో ఇష్టారాజ్యంగా పాలన సాగుతోంది. బలమున్నవాడికే పనులు జరుగుతున్నాయి. సామాన్యులకు కార్యాలయాల్లో పలికేవాడే కరువయ్యాడు. ప్రస్తుతం పాలన తీరు ఇలాగే ఉంది.

స్టడీమెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక భవిత కేంద్రంలో సిడిపిఒ సుధామాధురి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్, తినుబండారాలు, చాపలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు గోపాలకృష్ణ, షహీదా బేగం, ఆయా నారాయణమ్మ, ఐసిడిఎస్, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు..

లారీ బీభత్సం..

- అతివేగానికి నిండు ప్రాణం బలి
- స్కూటీని ఢీకొన్న బోరు లారీ
- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద ఘటన

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పొట్టకూటి కోసం కూలి పనికి బయలుదేరిన ఇద్దరు సోదరులు తాము పనిచేసే చోటుకు చేరకుండానే లారీ సృష్టించిన బీభత్సానికి ఒకరు మృత్యుఒడికి చేరుకోగా మరొకరు తీవ్రగాయాలకు గురై మృత్యువుతో పోరాడుతున్న ఘటన బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మార్టూరు సిఐ షేక్ ఫిరోజ్ కథనం ప్రకారం.. బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ముల పిల్లలైన షేక్ రహంతుల్లా(45) షేక్ హుస్సేన్‌సా మార్టూరులోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తమ స్వగ్రామం నుంచి స్కూటీపై కూలి పనికి బయలుదేరిన ఇద్దరు సోదరులు జొన్నతాళి వద్ద ఓ దుకాణంలో టీ తాగడానికి ఆగారు. అనంతరం ఇద్దరు స్కూటీ ఎక్కి తిరిగి బయలుదేరుతుండగా హైదరాబాదుకు చెందిన బోర్లు వేసే ఓ లారీ అతి వేగంగా నిర్లక్ష్యంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రహంతుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. హుస్సేన్‌సా తీవ్రంగా గాయపడ్డాడు. స్కూటీని ఢీకొట్టిన అనంతరం బోర్ లారీ



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రహంతుల్లా

డ్రైవర్ ఆపకుండా మార్టూరు వైపు పారిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన మార్టూరు ఎస్ఐ కోడూరి కమలాకర్ వెంటనే తమ సిబ్బందితో లారీని మార్టూరులో అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడ్డ హుస్సేన్‌సాను హైవే అంబులెన్స్‌లో గుంటూరు సర్వజన సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రహంతుల్లా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

టీ తాగిన కొద్దిసేపటికే..

కూలి పనికి బయలుదేరిన సోదరులు ఇద్దరూ జొన్నతాళి వద్ద టీ తాగడానికి ఆగారు. అనంతరం ఫ్యాక్టరీకి బయలు దేరడానికి బండి మీద ఎక్కి కూర్చోగానే.. సర్వీస్ రోడ్లో మృత్యువులా దూసుకొచ్చిన లారీ అదుపుతప్పి స్కూటీని ఢీకొట్టి అనంతరం జనాల మీదకి దూసుకుపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది.

శోకసంద్రంలో వల్లాపల్లి

స్కూటీని లారీ ఢీకొన్న ప్రమాదంలో సోదరుల కుమారులైన రహంతుల్లా ఘటనా స్థలంలోనే మృతి చెందటం, హుస్సేన్‌సా తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి పోవడంతో వల్లాపల్లి ముస్లిం కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అన్నదమ్ములు ఇద్దరూ ఇంటి నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదానికి గురవ్వడంతో వల్లాపల్లి గ్రామస్తులు పెద్దఎత్తున మార్టూరు ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం

ఆటోను వేగంగా ఢీకొట్టిన కారు - ఏడుగురికి గాయాలు, ఏరియా వైద్యశాలకు తరలింపు

ప్రజాశక్తి-చీరాల

అతివేగం ఆ చిన్నారిని బలి తీసుకుంది. పట్టుమని పదేళ్లు కూడా నిండ లేదు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అతివేగంతో వెళుతూ ఆటోను ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న అభం శుభం తెలియని ఆ చిన్నారి అక్కడికక్కడే మతి చెందిన దుర్ఘటన పర్చూరు-చీరాల మార్గమధ్యంలో శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలానికి చెందిన షేక్ సాజిదా, కరిముల్లా దంపతులు. వీరికి షేక్ మహ్మద్ ఉబేద్, రెండో కుమారుడు మహ్మద్ జయద్ సంతానం. పని నిమిత్తం భర్త కరిముల్లా దుబాయ్‌లో ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారుజామున తన రెండో కుమారుడైన మహ్మద్ జయద్ పుట్టువెంట్రుకల మొక్కును చెల్లించేందుకు ఆటోలో ఫిరంగిపురం నుంచి చీరాల మండలం వాడరేవుకు కుటుంబ సభ్యులు, బంధువులు బయలుదేరారు. ఈ సమయంలో పర్చూరు పాలిటెక్నిక్ కళాశాల సమీపానికి వచ్చేసరికి ఎదురుగా కారులో వస్తున్న కారంచేడుకు చెందిన జి చరణ్ అనే వ్యక్తి వేగంతో ఆటోను ఢీ కొట్టాడు. ఆటో రోడ్డుపై బోల్తా పడగా కారు రోడ్డుపక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో ఆటో లోపల



మృతిచెందిన చిన్నారి

ఉన్న సాజిదా, ఈమె ఆడబిడ్డ బీబీ, బంధువులైన సమీర, ఆరీఫా, సుభాని, మస్తానీ, రిహాన్, ఆటో డ్రైవరు జిలానీలకు గాయాలయ్యాయి. అదే విధంగా ఈమె పెద్దకుమారుడు మోహ్మద్ ఉబేద్(5)కు ఆటో లోపల ఇనుప సీటు కింద ఉన్న ఇనుప కడ్డీలు తగిలి ఒత్తిడి జరగగా ముక్కు చెవిలో నుంచి రక్తస్రావం అయ్యి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికుల సమాచారం మేరకు ఆటోలో ఉన్న క్షతగాత్రులతో పాటు కారులో ప్రయాణిస్తున్న గాయాలైన చరణ్‌ను 108 సిబ్బంది చీరాల ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రికి వచ్చిన కొద్దిసేపటికే ఉబేద్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పాఠశాలకు బీరువాలు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ అఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో, తిమ్మాయపాలెం (ఎ.ఎ) పాఠశాలకు 10 వేలు రూపాయలు విలువ చేసే 3 జింక్ రేకు బీరువాలు అందచేసే కార్యక్రమం, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి పుట్టినరోజు సందర్భంగా, వారి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం సర్వేశ్వరరావు, రోటరీ ప్రెసిడెంట్ చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, ముఖ్య అతిథి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, రోటరీ పెద్దలు సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, తమ్మన శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, స్కూల్ ఉపాధ్యాయులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి పుట్టినరోజు సందర్భంగా పుట్టి పెరిగిన తిమ్మాయపాలెంలోని అది ఆంధ్ర మండల ప్రాథమిక పాఠశాలకు 10 వేల రూపాయలు విలువ కలిగిన 3 జింక్ రేకు బీరువాలు బహూకరించడం అభినందనీయమని అన్నారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమ దాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రోటరీ క్లబ్ వారు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

అక్రమ ఓట్ల నమోదు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఓటర్ల జాబితాలో గుర్తు తెలియను వ్యక్తుల ఓట్లు నమోదు అవుతున్నాయని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని పట్టణాలు, మండలాల్లో గుర్తు లేని వ్యక్తుల ఓట్లు నమోదవుతున్నాయని, ఒక్కో ఇంట్లో కొందరి ఓట్లు తొలగిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తిస్తున్నారని మన ప్రాంతంలో కూడా ఉన్న ఓట్లు ఓటరు జాబితాలో సరిచూసుకోవాలని అన్నారు. ముందస్తు ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటు లేని పక్షంలో తిరిగి నమోదు చేసుకోవాలని కోరారు.

సారా నిరోధానికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

'సమాజహితం కోరుతూ జీవించాలి, జీవనశైలిలో మార్పు రావాలి' అని జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా ఆకాంక్షించారు. నాటుసారా కాస్తూ పట్టుబడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనపై స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. నాటుసారాను అరికట్టడంలో భాగంగా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనపై 19 కుటుంబాలకు రూ.22.30 లక్షల నగదును చెక్కుల రూపంలో జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. హాని కలిగించే నాటుసారాను బాపట్ల జిల్లాలో పూర్తిగా నిర్మూలించాలని కలెక్టరు కోరారు. ప్రజల ప్రాణాలు తీసే ప్రమాదకరమైన నాటుసారా తయారీ ఉండరాదన్నారు. మనకు ఆదాయం వస్తుందని ఇతరులకు హాని కలిగించేవి ఉత్పత్తి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నాటుసారా ఉత్పత్తిని పూర్తిగా విడిచి పెట్టి జనజీవన స్రవంతిలో గౌరవంగా జీవించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ

కలెక్టర్



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎస్పి

పథకాలను సద్వినియోగం చేసుకొని మీ పిల్లలు, కుటుంబాలను చక్కగా పోషించుకోవాలన్నారు. సంబంధిత కుటుంబాలలోని వారికి సొంత ఇళ్ల లేకపోతే నివాస స్థలం నెలరోజుల్లో కేటాయించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేయాలన్నారు. ఆ కుటుంబాలలో నిరుద్యోగులకు ఆయా ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగవకాశాలు కల్పిస్తామని తెలిపారు. నాటుసారా తయారీని విడిచిపెట్టడానికే ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పిస్తున్నా మని ఆయన వివరించారు. నాటుసారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని నూతన జీవన శైలిని అవలంబించాలన్నారు. మీపిల్లలకు మంచిని నేర్పించాలని, మంచిగా చదివించి ప్రయోజకులను చేయాలని అన్నారు. సమాజంలో గౌరవంగా జీవించే హక్కు ప్రతిఒక్కరికీ ఉందనే విషయాన్ని విస్మరించ రాదన్నారు. సదరు కుటుంబీకులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడంలో జిల్లా కలెక్టరు ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. స్వయం ఉపాధితో సదరు కుటుంబాలు మెరుగ్గా జీవించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి బి అర్జునరావు, ఎల్‌డిఎమ్ శివకృష్ణ, సెబ్ సహాయ సూపరింటెండెంట్ జి నరసింహారావు, బ్యాంకు అధికారులు, డిఆర్‌డిఏ అధికారులు పాల్గొన్నారు.

మేకల మందపై చిరుత దాడి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

మేకల మందపై చిరుత పులి దాడి చేయడంతో రెండు మేకలు మృతిచెందాయి. ఈ ఘటన మండల పరిధిలోని దిగువమెట్ట తండాలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దిగువమెట్ట తండాకు చెందిన శ్రీరామ్ నాయక్, వల్లినాయక్ ఇంటి పక్కన దొడ్డిలో ఉన్న మేకలపై చిరుత దాడి చేసింది. ఈ దాడిలో రెండు మేకలు మృతిచెందాయి. శుక్రవారం ఈ విషయాన్ని గుర్తించి మేకల యజమానులు, గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుత మేకల మందపై దాడి చేసినట్లు వారు నిర్ధారించారు. మేకల మందపై చిరుత దాడి గురించి తెలియడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

బెల్లం ఊట ధ్వంసం.. ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఎస్ఈబి స్టేషన్ పరిధిలోని నరజాముల తండా పరిసర ప్రాంతాల్లో శుక్రవారం యర్రగొండపాలెం ఎస్ఈబి సిఐ ఎన్ వెంకటరమణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నరజాముల తండాకు చెందిన బాణావత్ నరేష్ నాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతనికి బెల్లం అమ్మిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఈబి సిఐ ఎన్ వెంకటరమణ తెలిపారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో బెల్లు షాపులు నిర్వహించినా, నాటుసారా తయారు చేసినా, విక్రయించినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఈబి సిబ్బందితో పాటు యర్రగొండపాలెం, పుల్లలచెరువు ఎస్ఐలు జి కోటయ్య, శ్రీహరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టరు కింద పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలోని తాళ్లూరు రోడ్డు సమీపాన రోహిత్(11) అనే విద్యార్థి సైకిల్ మీద వెళ్తుతూ ప్రమాదవశాత్తు ట్రాక్టరు కింద పడి మృతి చెందాడు. చీమకుర్తి నుంచి కంకరతో ట్రాక్టరు వస్తుండగా సైకిల్ మీద వెళుతున్న విద్యార్థి రోహిత్ ప్రమాదవశాత్తు ట్రాక్టరు వెనుక భాగం తగిలి కిందపడి మృతిచెందాడు. తూర్పు గంగవరంలో స్వీట్ కొట్టు నడుపుతున్న లక్ష్మణ్ కుమారుడు రోహిత్ గీతాంజలి స్కూల్‌లో 6వ తరగతి చెందాడు. రోహిత్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

రజకులను నిర్బంధించిన వారిపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి-చీరాల

ప్రకాశం జిల్లా నూతలపాడు మండలం గురవారెడ్డి పాలెంలో దారిలో లెట్రిన్ బావులు నిర్మిస్తున్నారేమిటని అడిగినందుకు కాకర్ల వెంకట నారాయణ అనే రజకునిపై అదే గ్రామానికి చెందిన భీమనాదం కోటిరెడ్డి, భీమనాదం రామ లింగారెడ్డి గొడ్డలితో దాడి చేయడానికి



గొడ్డలితో రజకులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి

ప్రయత్నించారని రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, పి కొండయ్య, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు కిలారు పెద్దబ్బాయి పేర్కొన్నారు. ఇంటిలో నుంచి బయటకు రానీయకుండా రాళ్లు అడ్డంపెట్టి గొడ్డలితో నరుకుతానని గొడ్డలి చేత్తో పట్టుకొని బెదిరించిన వారిపై వెంటనే చర్య తీసుకోవాలని కోరారు. ఉదయం నుంచి మూడుసార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, పిల్లల్ని బడికి పంపడానికి కూడా వీలు లేదని బాధితుడు కాకర్ల వెంకట నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని రజకుడైన నారాయణకు రక్షణ కల్పించాలని వారు కోరారు.



తహశీల్దార్ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న సిబ్బంది

తహశీల్దార్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-చీరాల

తహశీల్దారు ప్రభాకర్‌రావు సేవలు ప్రశంసనీయమని, మండల అభివృద్ధికి ఆయన కృషి అభినందనీయమని ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ ప్రభాకర్‌రావు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఆయనను వేదిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. చీరాల మండలంలోని ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్న తహశీల్దార్ జీవిగుంట ప్రభాకర్‌రావు చీరాల వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సత్కరించటం ఆనందంగా ఉందని అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అందరి మన్ననలతో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సేవ సొసైటీ అధ్యక్షులు గుమ్మడి సూర్యప్రకాష్, సభ్యులు పిట్టు జెర్మియా, గుమ్మడి ఆశీర్వాదం, పాముల సీయోను రాజు, గుమ్మడి చంద్రం, ప్రజా వేదిక నాయకులు రామేశ్వరం కుమార్, రాజారత్నం, పండు, కుమార్, ముసలయ్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకున్న మంత్రి

ప్రజాశక్తి-కొల్లూరు



ప్రజలకు పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వారికి అందించటమే ముఖ్య ఉద్దేశమని, అందులో భాగంగానే జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి వారి ఇళ్ల దగ్గరికి అధికారులు వెళ్లి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, కౌలు రైతు గుర్తింపు కార్డులు అప్పటికప్పుడే అందిస్తారని, అందువలన మంచి చేసే ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఎన్నుకోవాలని ఆయన కోరారు.



పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-చీరాల

మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ కార్యాలయంలో అభివృద్ధి పనులను పంచాయతీ కార్యదర్శి ఎం కిరణ్ కుమార్ శనివారం పర్యవేక్షించారు. పంచాయతీ నిధులతో నూతనంగా మరుగుదొడ్ల ఏర్పాటు నిర్మాణం, కార్యాలయానికి నూతన గేటు, సమావేశాలు నిర్వహించుకునేందుకు రేకుల షెడ్డు నిర్మాణం పలు అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. కార్యాలయ ఆవరణంలో సచివాలయం కూడా ఉండటంతో రెవెన్యూ సేవలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు, సిబ్బందికి కనీస వసతులలో భాగంగా మరుగుదొడ్లను నూతనంగా నిర్మిస్తున్నామని కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని పంచాయతీలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు.

కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల

36 గంటల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రేపల్లె



సిడిపిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10,11 జిల్లా కలెక్టరేట్‌ల వద్ద 36 గంటల అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. రేపల్లె కార్యాలయంలో సమావేశం అనంతరం రేపల్లె ప్రాజెక్ట్ ఆఫీసులో ధర్నాలో పాల్గొంటున్నట్లు తెలియపరుస్తూ సూపర్ వైజర్ సుబ్బమ్మకు వినతిపత్రం అందజేశారన్నారు. సీఐటియూ రేపల్లె ఆఫీసులో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేపల్లె ప్రాజెక్ట్ సమావేశం యూనియన్ నాయకులు కె రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల గురించి పట్టించుకోకుండా అంగన్ వాడీ సెంటర్స్‌ను నాడు-నేడు పేరుతో అభివృద్ధి చేస్తున్నామని, పౌష్టికాహారం అందిస్తామని గొప్పలు చెబుతోందని విమర్శించారు. కనీసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందచేసే భోజనానికి సరిపడా డబ్బులు కూడా విడుదల చేయటం లేదని అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, గ్రాట్యూటీ, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామనే ప్రభుత్వం అంగన్‌వాడీలకు గతం నుంచి అమలవుతున్న అనేక రకాల పథకాలు అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యుత్తు సబ్సిడీ లాంటి పథకాలను కూడా రద్దు చేసిందని అన్నారు. రాష్ట్రంలో చాలా చోట్ల అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో అంగన్‌వాడీ వర్కర్‌ను ట్రాక్టర్‌తో తొక్కించి చంపటం, కృష్ణా జిల్లా పామర్రు ప్రాజెక్టులో రాజకీయ నాయకుల వేధింపుల వల్ల అంగన్‌వాడీ వర్కర్ ఆత్మహత్యా యత్నం చేయటం లాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం చూసీ చూడనట్టు ఉంటుంది. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కే ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ప్రతినెలా జీతాలు లేక, మీటింగ్స్‌కు అటెండ్ అవ్వాలంటే టిఎ బిల్స్ లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని, వైఎస్సార్ పోషణ పథకానికి వండటానికి అవసరమైన డబ్బులు లేకపోవడంతో సొంత డబ్బులు ఖర్చు పెడుతూ ఇబ్బందులు పడుతున్నారు. మానసిక ఒత్తిడికి గురై రోగాల బారినపడి చనిపోతున్నారని, ఏళ్లతరబడి, ప్రభుత్వ ఐసీడీఎస్ సేవలో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని, గౌరవ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక హామీలు ఇచ్చారని, తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. తెలంగాణలో సుమారు రూ.15,000 గత 2 సంవత్సరాల నుంచి అమలవుతోంది కానీ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ ఎక్కడా అమలు కావటం లేదని అన్నారు. అందుకోసం జులై 10,11 తేదీల్లో బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నాలో వర్కర్స్, హెల్పర్స్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రేపల్లె ప్రాజెక్ట్ కార్యదర్శి కె వాణి, నాయకులు నిర్మల జ్యోతి, ఎన్ కృష్ణకుమారి, కె రత్నకుమారి, హేమలత, వెంకటలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపట్నం: ఈ నెల 10,11 తేదీలలో బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద 36 గంటల అంగన్‌వాడీల ధర్నా నేపథ్యంలో సమస్యలు పరిష్కారం చేయాలని పల్లపట్ల ప్రాజెక్ట్ సిడిపిఓ అనసూయకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు వేతనాలు, గ్రాట్యూటీ, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయటం లేదని అన్నారు. జులై 10,11 తేదీల్లో బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద జరగనున్న 36 గంటల ధర్నాలో వర్కర్స్, హెల్పర్స్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్లపట్ల అధ్యక్షురాలు వై మేరీమణి, నాయకులు శిరిషా, మంగదేవి, చైతన్య పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో ఆరోగ్యం: డాక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీరాల



విద్యార్థులతో మొక్కలు నాటుతున్న డాక్టర్ బాబురావు

మొక్కల పెంపకం లోపంతో అధిక ఉష్ణోగ్రతలు, కాలుష్యం, వాతావరణంలో అనేక మార్పులు వస్తూ అనారోగ్యం పాలవుతున్నారని, మొక్కల పెంపకంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రేమ హాస్పటల్ ఎండి, ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ ఐ బాబురావు అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్డె సంఘంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు సుభాషిణి, డాక్టర్ బాబురావు, విద్యార్థులకు పుస్తకాలు, మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టంతో కాకుండా కష్టపడి చదివితేనే మంచి ఉత్తీర్ణత సాధిస్తారని అన్నారు. అధ్యాపకుల చెప్పే పాఠాలను అవగాహన చేసుకుని ఇంటి వద్ద వాటిని చదువుకుంటూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుభాషిణి, పార్వతి, శ్రీలత, నళిని, ఎస్ఎస్ లక్ష్మి, హెచ్ఎం రంగారావు, ఇన్నర్ వీల్ మెంబెర్స్, స్కూల్ కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మరోపేరు ఎన్‌సిసి

కమాండర్ కల్నల్ సునీల్ గౌతమ్ ● ఎన్‌సిసి క్యాడెట్స్ ధృవీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-చీరాల



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న కమాండర్

క్రమశిక్షణకు మరోపేరు ఎన్‌సిసి అని 23వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి కమాండర్ కల్నల్ సునీల్ గౌతమ్ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎన్‌సిసి విద్యార్థులకు ఏ సర్టిఫికెట్ ప్రధానోత్సవం స్కూల్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ జీనా జోవియర్, ట్రీసా ఆధ్వర్యంలో ఎన్‌సిసి కేర్ టేకర్ అధికారి పి గోపినాథ్ పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్‌సిసి కమాండర్ కల్నల్ సునీల్ గౌతమ్, ఎస్ ఎం సుదేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి సర్టిఫికెట్‌లు విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్తులో వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. విద్యార్థులకు ఎన్‌సిసి ఎంతో అవసరమన్నారు. వారిలో శరీర దృఢత్వంతో పాటు, ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని అన్నారు. ముందుగా కమాండర్ కల్నల్ సునీల్ గౌతమ్‌కు ఎన్‌సిసి విద్యార్థులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. స్కూల్లో మొత్తం 40 మంది ఎన్‌సిసి విద్యార్థులు ఉండగా వారిలో 37 ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఏ సర్టిఫికెట్, ముగ్గురికి బి సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎల్ స్టాఫ్ హవాల్దర్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరీ, పిఇటిలు విజయనిర్మల, ధనుంజయ, పలువురు పాల్గొన్నారు.

కోనేటిపురంలో 'జగనన్న సురక్ష' పత్రాలు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు





కోనేటిపురంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి నాగార్జున, పంగులూరు మండలంలో వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య..

మండలంలోని కోనేటిపురం గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సంక్షేమ పాలన జగన్మోహన్‌రెడ్డి కె సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వం ఉచితంగా అందజేయడం సంక్షేమానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్‌డిఓ పార్థసారథి, మండల ప్రత్యేక అధికారి వి వినోద్, ఎంపిపి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, ఎంపిడిఓ చంద్రశేఖర్, సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, నాయకులు మోర్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పంగులూరు: జగనన్న సురక్షతో సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయని, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని పంగులూరు-1, చందలూరు సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలను అందించి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పంగులూరు-1, సచివాలయం పరిధిలో ఈపాటికే 483 మంది సమస్యలు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. వాటిలో 90 శాతం సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. కుల, ఆదాయ, సిసిఆర్ కార్డులు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు అందజేశారు. తహశీల్దారు పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామాంజనేయులు, పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ, జనకవరం గ్రామ సర్పంచ్ వీరమ్మ, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జడ్పిటిసి రాయిని ప్రమీల, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయని వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ గుర్రం కళ్యాణి, చందలూరు సొసైటీ అధ్యక్షులు వీరాంజనేయులు, కో ఆప్షన్ మెంబర్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10,11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటలు పాటు నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకులు కోరారు. ధర్నాకు సబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుల చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మమ్మ మాట్లాడుతూ చాలీ చాలని జీతంతో అంగన్‌వాడీలు అనేక అవస్థలకు గురవుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్‌గా మార్చాలన్నారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.నాగేశ్వరమ్మ, జి.రమాదేవి, ఎం.దీనమ్మ, ఎ.నారాయణమ్మ, మేరీ, ఉషశ్రీ, జి.ఈశ్వరమ్మ, సామ్రాజ్యం పాల్గొన్నారు, **దర్శి :** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల ఈనెల 10, 11 తేదీలలో కలెక్టరేట్ 36 గంటల ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు తెలిపారు. తాము అంగన్‌వాడీల కేంద్రాలను మూసి ధర్నా పాల్గొంటున్నట్లు తెలుపుతూ సిడిపిఒ పుల్లమ్మకు అంగన్‌వాడీలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు అచ్చమాంబ, జయమ్మ, తిరుపతమ్మ, ప్రశాంతి, సుజాత, బాలమ్మ పాల్గొన్నారు. **సిఎస్.పురం :** మధ్యాహన్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఇఒకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వ సరఫరా చేయాలన్నారు. కార్మి కులకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్, వంట సామగ్రి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నాగమ్మ, మస్తాన్, ఎస్తేరమ్మ, లలితమ్మ, ప్రసూన, బిబిజాన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.**పెద్దదోర్నాల :** అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11,12 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న 36 గంటల ధర్నా ను జయప్రదం చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు కోరారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే తెలంగాణా ప్రభుత్వం కన్నా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాలు దాటిన ఆ హామీని అమలు చేయలేదన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అనంతరం 11, 12 తేదీల్లో అంగన్‌వాడీ సెంటర్లు మూసివేసి నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని తెలియజేస్తూ సిడిపిఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ముంతాజ్, వెంకటలక్ష్మి, వెంకటరత్నం, నాగేంద్ర, కుమారి, రాణి, మల్లేశ్వరి, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.


పెద్దదోర్నాలలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు


దర్శిలో వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పోతలపాడులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-మార్కాపురం

మండల పరిధిలోని గజ్జలకొండ పంచాయతీ, తర్లుపాడు మండల పరిధిలోని పొతలపాడు గ్రామంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి తల్లికి ఏడాదికి రూ.15 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి మహిళకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తారని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల

సెక్యూరిటీ గార్డు డేవిడ్‌ను ఆదుకోవాలి

సిఐటియు ఒంగోలు నగర్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ వైద్యశాలలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ మూడు రోజుల క్రితం ఆత్మహత్యకు ప్రయత్నించిన డేవిడ్‌ను ఆదుకోవాలని, అందుకు బాధ్యుడైన కాంట్రాక్టర్ సాయి పై చర్యలు తీసుకోవాలని సిఐటియు ఒంగోలు నగర కమిటీ డిమాండ్ చేసింది. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పి.డేవిడ్‌ను సిఐటియు ఒంగోలు నగర కమిటీ శుక్రవారం పరామర్శించింది. ఈ సందర్భంగా సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ రుద్రవరం గ్రామానికి చెందిన డేవిడ్ గత నాలుగు సంవత్సరాలుగా రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ సాయి సెక్యూరిటీ గార్డు కార్మికులకు సబంధించిన పిఎఫ్, ఇఎస్ఐ నగదును జమ చేయలేదని తెలిపారు. పిఎఫ్ లోను తీసుకోవాలని అందుకు సంబంధించిన డబ్బులు అమౌంట్ చెల్లించలేదని ఆన్లైన్లో చూపిస్తుంది పిఎఫ్ నగదు జమ చేయాలని సాయిని డేవిడ్ కోరినట్లు తెలిపారు. అయితే సాయి సరైన సమాధానం చెప్పలేని తెలిపారు. దీంతో డేవిడ్ ఈ విషయాన్ని జిల్లా అధికారుల దష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. దీంతో డేవిడ్ ఈ విషయాన్ని అధికారులు దష్టికి ఎందుకు తీసుకెళ్లావని డేవిడ్‌ను భయబాంత్రులకు గురించినట్లు తెలిపారు. దీంతో డేవిడ్ ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. ఈ ఘటన విచారణ జరిపి అందుకు సంబంధించిన కాంట్రాక్టర్‌పై పని చర్యలు తీసుకోవాలని, వారి టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షుడు శ్రీరామ శ్రీనివాసరావు, నాయకులు కొల్లా బత్తిన గోపి పాల్గొన్నారు .


డేవిడ్‌ను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

గిరిజనులకు బ్యాంకు ఖాతాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం బింగినపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజనులు బ్యాంకు ఖాతాలు లేవు. ఈవిషయాన్ని గుర్తించిన న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వరు ప్రభుత్వ పథకాలు పొందాలంటే బ్యాంకు ఖాతాలు తప్పనిసరి అనే అంశంపై గిరిజనులకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం వారి నివాసాల వద్దే స్టేట్ బ్యాంకులో ఖాతాలు ఇప్పించి పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అవగాహన లేక గిరిజనులు అనేక ప్రభుత్వ పథకాలను దూరం అవున్నట్లు తెలిపారు. గిరిజనులకు బ్యాంకు ఖాతాలు అందజేసేందుకు కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు ఖాజా హుస్సేన్ సహకరించారు. బ్యాంక్‌లో ఖాతాల మంజూరుకు త్వరితగతిన సహకరించిన మేనేజర్ వెంగమాంబ మరియు సిబ్బందికి గ్రామస్తులు ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు.


బ్యాంకు ఖాతా పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

యువత భవిత కోసమే పాదయాత్ర : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పొన్నలూరు

యువత, బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టినట్లు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. స్థానిక కార్యాలయంలో టిడిపి మండల స్థాయి విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను వేధింపులకు గురి చేస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో నిర్వహించే నారా లోకేష్ పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దామచర్ల సత్య మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ పాదయాత్ర కొండపి నియోజక వర్గంలో పర్య టించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, నాయకులు కర్నా కోటిరెడ్డి, సన్నమురి నరసింహారావు, ఒంగోలు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు నందికనుమ బ్రహ్మయ్య, ఒంగోలు పార్లమెంట్ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి రాపూరి కోటేశ్వ రమ్మ, తెలుగు యువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండవ మురళి, టిడిపి నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ నేలపాటి బ్రహ్మయ్య చౌదరి, యువత అధ్యక్షుడు బోయపాటి రమణారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షులు కుర్రా మాల్యాద్రి, రైతు సంఘం అధ్యక్షుడు కుంకు సురేష్, మైనారిటీసెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బిరుదుల ఆరోను, దాసరి కష్ణారావు, చిడిపోతు శ్రీకాంత్, జి. వెంకట్రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని క్రిష్ణంశెట్టిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'జార్జి'లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక జార్జి ఫార్మసీ కళాశాలలో 19వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం నిర్వహిఒచారు. ఈ సందర్భంగా ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తమ వంతు ఖచ్చితమైన దిశ నిర్దేశం ఉండాలన్నారు. అలా ఉన్నప్పుడే వారు తమ విజయాలు సాధిస్తారని, టైం విలువ తెలుసుకొని కష్టపడి చదవాలని దానితో పాటు తెలివితేటలు కూడా పెంచుకోవాలన్నారు. డాక్టర్ శ్రీనివాసులు ఏరువ, డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అనేది విజయానికి మొదటి అడుగు అని తర్వాత దేశానికి సేవ చేయడానికి తొలి అడుగు అని వివరించారు. జార్జి కళాశాల అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ స్టెల్లా సతీష్ మాట్లాడుతూ టైం విలువ, విద్యార్థుల యొక్క టాలెంట్ అమోఘమని ప్రతి ఒక్క విద్యార్థి వండర్‌గా నిలిచి ప్రపంచానికి ఉపయోగపడతారని తెలియజేశారు. జార్జ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తర్వాత తమ భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజా జయరావు పాల్గొన్నారు.


బస్సును ప్రారంభిస్తున్న బత్తుల సుప్రజ

వేలంగిని యాత్ర బస్సు ప్రారంభం

శింగరాయకొండ : శింగరాయకొండ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని వేలంగిని మేరీ మాత పుణ్యయాత్ర బస్సును ఆర్‌టిసి జోనల్ చైర్మన్ బత్తుల సుప్రజారెడ్డి శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి, సిఐ ప్రసాద్, పి. లక్ష్మయ్య, .సుజాత పాల్గొన్నారు.

పలకలు అందజేత

ముండ్లమూరు : పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పుట్టినరోజు సందర్భంగా రోటరీ క్లబ్ అఫ్ సింగరకొండ వారి ఆధ్వర్యంలో పసుపుగల్లు మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాత పుస్తకాలు, పలకలు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ చిన్ని మురళీ కష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, ఎంఇఒలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, కోశాధికారి కొల్లా భువనేశ్వరి, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, అద్దంకి లేవి ప్రసాద్, డాక్టర్ ఉబ్బా దేవపాలన, మలాది శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, ఉపాధ్యాయులు రజని, అంకమ్మ, పిసి చైర్మన్ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం



మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వరిమడుగు వెంకట రామిరెడ్డి వైఎస్ఆర్టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక య్యారు. ఆయన గత 12 సంవత్సరాలుగా వైఎస్సార్టిఎఫ్లో వివిధ హోదాలలో పని చేశారు. రెండు సంవత్సరాల నుంచి వైఎస్ఆర్టిఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. వైఎస్ఆర్టిఎఫ్ నిర్మాణం, అభివద్ధిలో విశేషంగా కషి చేసినందుకు గుర్తింపుగా వైఎస్ఆర్టిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వరిమడుగు వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు బాధ్యతలు అప్పగించిన రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డికి, వైఎస్ఆర్టిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జాలిరెడ్డికి, అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డికి, జనరల్ సెక్రెటరీ సుధీర్కు కతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

గిరిజనులకు ఉపాధి పనులు కల్పించడంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ శీనారెడ్డి హెచ్చరించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులకు పనులు కల్పించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం శీనారెడ్డి మాట్లాడుతూ వలసలు నివారించేందుకు ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పనులను కుటంబానికి వంద రోజులు కల్పించాల్సి ఉండగా 30 రోజులు కూడా కల్పించకపోవడంలో గల ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. చెంచులకు ఉపాధి పనులు వంద రోజులు కల్పించాలని సూచించారు. సిబ్బంది పని తీరు మార్చు కోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ, ఎపిఒ అన్నపూర్ణ, ఇసి శ్రీనివాసరెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు ఎస్ఐగా కృష్ణయ్య

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు ఎస్ఐగా యువి.కృష్ణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐ పనిచేస్తున్న సంపత్కుమార్ విఆర్కు బదిలీ అయ్యాడు. దీంతో ఒంగోలులో వన్టౌన్లో పనిచేస్తున్న కృష్ణయ్య ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

భూసర్వే వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి-పొదిలి

గ్రామాల్లో భూసర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. పొదిలి రెవెన్యూ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న సర్వేపై కలెక్టర్ ఆరా తీశారు. సర్వే తీరు గురించి తహశీల్దారు కలెక్టర్కు వివరించారు. సర్వే త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి ఆర్ఐ కిలారి సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి- బేస్తవారిపేట

మండల పరిధిలోని మోక్షగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి , జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మోక్షగుండం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రయోజనం

ప్రజాశక్తి -దర్శి

జగనన్న సురక్ష పథకం ప్రజలకు ఎంతో ప్రయోజనమని వైస్ఎంపిపి కొరివి ముసలయ్య, లంకోజనపల్లి గ్రామ సర్పంచి కొరివి చిన్నకోటయ్య తెలిపారు. మండల పరిధిలోని లంకోజనపల్లి గ్రామంలో జగనన్న సురక్ష డిటీ దేవప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని పెద్దఉయ్యాలవాడ గ్రామంలో ఇఒఆర్డి శోభన్బాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పోతంశెట్టి సీతారావమ్మ మురళీమోహన్ లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమాలలో పంచాయతీ కార్యదర్శి సునీత, విఆర్ఒ పవన్కుమార్ పాల్గొన్నారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్డి కెజిఎస్ రాజు, డిటీ ఇమ్మానియేలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **చీమకుర్తి :** రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని మంచికలపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై విత్తనాలు, సరిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాఘవేంద్రరావు, సర్పంచి పెరికల నాగేశ్వర రావు, ఎంపిటిసి అత్యాల అంకయ్య, మాజీ ఉపసర్పంచి పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు. **పొదిలి :** జగనన్న సురక్ష కార్యకమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని ఎంపిడిఇఒ శ్రీకృష్ణ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, ఇఒఆర్డి కె. రాజశేఖర్, సర్పంచి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు రవీంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుర్రపుశాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, సర్పంచి వాడాల పద్మావతి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్రెడ్డి, వైసిపి అధికార ప్రతినిధి నర్రెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వై. వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **టంగుటూరు :** సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్ఛార్జి వరికూటి అశోక్బాబు తెలిపారు. మండల పరిధిలోని పొందూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు, నాయకులు ఏలూరి వంశీకష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గహసారథులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** మండల పరిధిలోని సోమరాజుపల్లి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్ఛార్జి వరికూటి అశోక్బాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో సిఎం జగన్మోహన్రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.ఉష, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్రెడ్డి, సర్పంచి యన్నాబత్తిన సరోజనమ్మ, డాక్టర్ యన్నాబత్తిన కార్తీక్, షేక్ సుల్తాన్, షేక్ సలీంబాషా పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** మండల పరిధిలోని గొట్లగట్టు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు ఐసిడిఎస్ పీడీ కె.మాధురి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బివి.ప్రసాద్, ఇఒపిఆర్డి జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ, సచివాలయ సిబ్బందితో గ్రామ వాలంటీర్లు. ఎంపిటిసి ఉడుముల రామనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ సురవరం వెంకట్రెడ్డి, చిన్నారిగట్ల సొసైటీ అధ్యక్షుడు ఉడుముల కాశిరెడ్డి, గొట్లగట్టు సర్పంచి పెరికే సుఖదేవ్, ఉపసర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, వైసిపి నాయకులు పోలసాని నారాయణరెడ్డి, వెంకటకొండయ్య, ఉప్పుటూరి వెంకటయ్య పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని వెలిగండ్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి, మాజీ జడ్పిటిసి మెట్టు వెంకటరెడ్డి, జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచి పాతకోట వెంకటరెడ్డి, ఎంపిడిఒ అద్దంకి శ్రీనివాసమూర్తి, వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** జగనన్న సురక్ష పథకం పేదలకు వరమని ఎంపిపి నలమలపు అంజమ్మ తెలిపారు. మండల పరిధిలోని కండ్లగుంట, కనపర్తి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించాలన్నారు అనంతరం లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కండ్లగుంట సర్పంచి పల్లెర్ల అంజిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి అంజుల, ఎంపిడిఒ జయమణి, నలమలపు కష్ణారెడ్డి, పి శ్రీమన్నారాయణ, కె. త్రినాథ్ రెడ్డి పాల్గొన్నారు. **ఒంగోలుసబర్బన్ :** జగనన్న సురక్ష పథకంతో ప్రజలు ఎంతో మేలు కలుగుతుందని ఒంగోలు నగర అస్టిసెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఒంగోలు నగర 10వ డివిజన్ పరిధిలోని కొప్పోలు సచివాయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ పద్మజ, సచివాలయ సిబ్బంది శ్రీకాంత్, సునీల్, వాలంటీర్లు ధనలక్ష్మి, అశ్వని, అనూష, సుధాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపట్నం :** మండల పరిధిలోని గుండమాల సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అర్చన, గ్రామ సర్పంచి కారాని జైరావు, ఎంపిడిఒ సుజాత, డిప్యూటీ తహశీల్దారు అర్జున్ రెడ్డి, జూనియర్ సహాయకులు ఆదిత్య పవన్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర రెడ్డి, లావణ్య, మల్లికార్జున పాల్గొన్నారు. **వెలిగండ్ల :** మండల పరిధిలోని రామగోపాలపురం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్య నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి సారధ్యంలో రాష్ట్రం సంక్షేమం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వైసిపి మండల మాజీ కన్వీనర్ చిలకల వెంకటేశ్వర్రెడ్డి, రంగన్నపల్లి సర్పంచి బొబ్బ రమణారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం, తహశీల్దారు నాగార్జునరెడ్డి, ఎంపిటిసి చిలకల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపిపి తాతపూడి మేరీపుష్ప, నాగూర్ యాదవ్, జెసివి కన్వీనర్, సింగిల్ విండో అధ్యక్షుడు పోల్లా సుబ్రహ్మణ్యం, దేవ సహాయం, బొబ్బా వెంకటరెడ్డి, కుప్పనబోయిన వెంకట రామయ్య, వైసిపి మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, ఎలిక నారాయణ, ఎలిక రమణయ్య పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమంతునిపాడు ఎంపిపి గాయం సావిత్రి తెలిపారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కష్ణారావు, సచివాలయల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, వైస్ఎంపిపి రుద్రపాటి శోభ, రాజు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని సేవలు అందించాలని తహశీల్దార వేణుగోపాల్ తెలిపారు. పెద్దదోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యమ్రంలో ఎంపిడిఒ విజయ, ఎఒ జవహర్లాల్ నాయక్ పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ, ఎంపిపి



వెలిగండ్లలో సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

దళిత సంఘాల రిలే దీక్షలు భగ్నం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరాయి. ఈ రిలే దీక్షను పోలీసులు భగ్నం చేశారు. మార్కాపురం పట్టణ ఎస్ఐ, రూరల్ ఎస్ఐలు తమ సిబ్బందితో దీక్షా శిబిరం వద్దకు వచ్చి దీక్షలో కూర్చున వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సందర్భంగా దళిత నాయకులు సంద్రపాటి కాలేబు, జనుమాల నాగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఒత్తిడి మేరకే పోలీసులు దీక్షను భగ్నం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నందం శేఖర్, కిషోర్, రాజు రామాంజనేయులు, చెన్నకేశవులు, శాంత కుమార్, చినబాబు, నాసరు, సుబ్బయ్య, తిమోతి, రాజు చెన్నకేశవులు, చెన్న, దివాకర్, రాము, దత్తు, శ్రీను, కాశీ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత రిలే దీక్షలకు బిజెపి నియోజకవర్గ ఇన్ఛార్జి కష్ణారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కష్ణారావు మాట్లాడుతూ దళితులకు అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించడానికి ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి ఎందుకు ఆలోచిస్తున్నారో అర్ధం కావడం లేదన్నారు. అవసరమైతే తన సొంత స్థలాన్ని ఇవ్వడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఐదవ రోజులో దీక్షలో మాల ఐక్యవేదిక ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి నందం శేఖర్, దళిత సైన్యం రాష్ట్ర నాయకులు యోనిబెర కిషోర్, వివిధ సంఘాల కార్యకర్తలు కూర్చున్నారు.



దీక్షా పనులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రమాదకరంగా పాఠశాల భవనం

ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆందోళన ● తొలగించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-పంగులూరు

ఒకప్పుడు విద్యార్థులు ఆ భవనంలో కూర్చొని చక్కగా చదువుకున్నారు. అయితే ఇప్పుడు ఆ భవనం శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతుందో, ఎవరికి ఏ ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళన విద్యార్థుల్లోనూ, ఉపాధ్యాయుల్లోనూ కలుగుతోందని అన్నారు. భవనాన్ని తొలగించమని ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి వేడుకుంటున్నా, అటు అధికారులు గానీ, ఇటు రాజకీయ నాయకులు గానీ పట్టించుకోవడం లేదు. భవనాన్ని కూల్చటానికి ఆ అధికారి పర్మిషన్ కావాలని కొంతకాలం, ఈ అధికారి పర్మిషన్ కావాలని కొంతకాలం, కాలయాపన చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం కూడా ఆ ప్రమాదాన్ని గుర్తించినట్లు లేరు. అయితే విద్యార్థులు ఆ భవనం పక్కగా వెళుతున్న ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలవుతోంది. ఏ ప్రమాదం జరుగుతుందోనని ఎప్పటికప్పుడు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో 1975 ప్రాంతంలో మూడు గదులతో ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. కొంతకాలం వరకూ బాగానే ఉన్న పాఠశాల, గత 7 సంవత్సరాల కాలంలో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ భవనంలోకి తీసుకెళ్లటం మానుకున్నారు. గత నాలుగేళ్లుగా ఆ భవనం ఖాళీగా ఉంటోంది. అందులో ఒక గదిని పగులగొట్టి టాయిలెట్స్‌ను రెండు సంవత్సరాల క్రితం నిర్మించారు. ఇంకా రెండు గదులు ఖాళీగానే ఉన్నాయి. అయితే ఈ భవనం పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు ఏది విరిగి పడుతుందోనని, ఏ ప్రమాదం రానుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు అటు అధికారులకు, ఇటు రాజకీయ నాయకులకు విన్నవించుకున్నా ఫలితం కనబడలేదు. అధికారులు ఎంపిడిఓ పర్మిషన్ కావాలని కొంతకాలం, ఎంఈఓ పర్మిషన్ కావాలని కొంతకాలం, డిఈఓ పర్మిషన్ కావాలని కొంతకాలం కాలయాపన చేస్తూ వచ్చారు. పంచాయతీ పాలకవర్గం కూడా దీన్ని పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు క్షణ క్షణం.. భయం భయంగా గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు భవనాన్ని పరిశీలించి వెంటనే దాన్ని తొలగించాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు తెలిపారు.


అలవలపాడులో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం



అపాయం, ప్రవేశం లేదని గోడపై రాసిన దృశ్యం

కుల దూషణలు చేస్తున్న ఎన్ఆర్ఐ

పంచ్ ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రేపల్లె

ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలపై కుల దూషణలు చేస్తూ అసభ్యకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్న వైసిపి ఎన్ఆర్ఐ సోషల్ మీడియా ప్రతినిధి పంచ్ ప్రభాకర్ అలియాస్ ప్రభాకర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జై భీమ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు దోవా రమేష్ రాంజీ రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలు, బీసీలు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అడ్డుపెట్టుకుని విర్రవీగుతున్నారని, 2024లో ఇండియాకు వస్తున్నా ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి దళితులందరినీ తరిమి తరిమి కొడతాం, కలుపు మొక్కల్లాగా ఏరిపారేస్తామని సవాలు విసురుతూ పంచ్ ప్రభాకర్ చేస్తున్న వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. పంచ్ ప్రభాకర్ వ్యాఖ్యలపై ఎస్సీ ఎస్టీ బీసీ కమిషన్లు స్పందించి సుమోటోగా కేసులు నమోదు చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సభ్య సమాజం తలదించుకునేలా అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్న పంచ్ ప్రభాకర్‌పై తమకున్న విచక్షణాధికారాలను ప్రయోగించాలన్నారు. తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే ప్రభాకర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కమిటీ సభ్యులు పోలిమెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు కరా ప్రతాప్ కుమార్, నల్లూరి వెంకటేశ్వరరావు, తెనాలి దీనరాజ్, జై భీమ్ భారత్ పార్టీ రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, నాయకులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, నేరుసు వెంకటరావు నాయుడు, నిమ్మగడ్డ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వాహనాలను

కండిషన్‌లో ఉంచుకోవాలి: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వివిధ ప్రజా సేవలకు వినియోగించే పోలీస్ వాహనాలను మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ఉన్న పలు రకాల పోలీసు వాహనాలను, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు, పోలీస్ అధికారులకు కేటాయించిన వాహనాల పనితీరును, వాటి నిర్వహణను పరిశీలించి అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ పోలీసు స్టేషన్లకు సంబంధించిన వాహనాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, కండీషన్‌లో ఉంచుకోవాలని, వాహనాలకు పెయింటింగ్, పోలీసు స్టిక్కర్స్, అత్యవసర హారన్ మొదలైనవి సక్రమంగా అమర్చుకోవాలని, రిపేరు వస్తే వెంటనే చేయించాలని, క్లీనింగ్, సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్ మార్చుట, టైర్ల నిర్వహణ పట్ల డ్రై వర్లు, మెకానిక్‌లు శ్రద్ధ వహించాలని ఎస్పి సూచించారు. పోలీస్ అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా చూసుకోవాలని సూచించారు. పోలీస్ వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను ఎప్పటికప్పుడు సమర్పించాలని వాహన నిర్వహణ, పనితీరు, కేటాయింపు పట్ల శ్రద్ధ వహించాలని, ముమ్ముందు కూడా వాహనాలను జాగ్రత్తగా చూసుకోవాలని పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగ సిబ్బందిని ఆదేశించారు. వాహన నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వాహనాన్ని మంచి కండిషన్లో, పరిశుభ్రంగా ఉంచుకొన్న వాహన డ్రైవర్లను జిల్లా ఎస్పీ అభినందించారు. ఎస్పీ వెంట ఏఆర్ డిఎస్‌పి ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మథరావు, ఎమ్‌టి విభాగ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన సీఈసీ విద్యార్థి

ప్రజాశక్తి-చీరాల


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్

చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ఈసీ మూడో సంవత్సరం విద్యార్థి 96.7 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో అడుగుపెట్టే సమయంలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. దాని ప్రకారం ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కళాశాలలో చదువు, సంస్కారం నేర్చుకుని ఉత్తమ పౌరుడుగా తయారైనప్పుడే తల్లిదండ్రులు సంతోషిస్తారని అన్నారు. సుబ్బారెడ్డి రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపటం అభినందనీయమన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా తీర్చి దిద్దేందుకు కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లటంతోనే సుబ్బారెడ్డి మంచి ఫలితాలు సాధించాడని తెలిపారు. మిగిలిన విద్యార్థులు సుబ్బారెడ్డిని ఆదర్శంగా తీసుకొని అవకాశాల్ని సద్వినియోగం చేసుకొని కష్టపడి మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సుబ్బారెడ్డితో పాటు అత్యధిక మార్కులు సాధించిన కె విగ్నేష్ 93.9 శాతం మార్కులు, టీ నాగ సుదర్శన్ 92.9, ఎం లిఖిత 86 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఫణి కుమార్, ఈసి హెచ్ఓడి, ఆర్‌వి రమణయ్య, సీఎంఈ హెచ్ఓడి మణికంఠ, ఇంజనీరింగ్ విభాగం సిఎస్సి హెచ్ఓడీ డాక్టర్ సౌజన్య, ఇసి హెచ్ఓడి రాధాకుమారి, అధ్యాపకులు రత్నకుమార్, జాన్ వర కుమార్, మణి కుమార్ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి.. అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి-కారంచేడు



బాపట్ల జిల్లా కారంచేడు మండలం రంగప్ప నాయుడు వారి పాలెం పంచాయతీ నుంచి ప్రముఖ సినీ ఫైట్ మాస్టర్లు సొంత గ్రామమైన నంది గుంట పాలెం గ్రామం మీదుగా చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామానికి మధ్యలో ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న ఈ రహదారి రాళ్లు పైకి వచ్చి వాహనదారులకు నరకం చూపిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే భయపడుతున్న పరిస్థితి. ఇక రాత్రిపూటైతే వాహనాలు అదుపుతప్పి కిందపడి అనేక మంది ప్రమాదాల బారిన పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. రెండు మండలాల మధ్య ఉన్న ఈ మూడు కిలోమీటర్ల రహదారి గత రెండు దశాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోక దారుణంగా తయారయింది. ప్రజలు ఈ రహదారిలో ప్రయాణం చేయలేక పక్కనే ఉన్న పంట పొలాల్లో బళ్ల బాటలో ప్రయాణం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదే రహదారి మధ్యలో సినీ ఫైట్ మాస్టర్ రామలక్ష్మణుల సొంత గ్రామం నందిగుంటపాలెం కూడా ఉంది. వ్యవసాయ సీజన్లో అయితే టైరు బండ్లు, ట్రాక్టర్లు పైన వచ్చే రైతులకు తీవ్రమైన ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని ఈ రహదారిని బాగు చేయించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కర్లపాలెం ఎంపిడివో దాసరి రాంబాబు

వైసీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు రక్ష

ప్రజాశక్తి-కర్లపాలెం

అర్హులైన నిరుపేదలకు వైసీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అన్నీ అందుతున్నాయని కర్లపాలెం ఎంపిడివో దాసరి రాంబాబు అన్నారు. శుక్రవారం కర్లపాలెం మండలం దమ్మన్నవారిపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జగనన్న సురక్ష ప్రత్యేక అధికారి సైదా నాయక్, సర్పంచ్ గుర్రపసాల వెంకటేశ్వరమ్మ, బోలయపాలెం సర్పంచ్ కేసన లక్ష్మి, నాగరాజుపాలెం సర్పంచ్ షేక్ మస్తాన్ బీ, డిటి సలీమా, సూపరింటెండెంట్ ఫైజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-భట్టిప్రోలు (వేమూరు)

ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ జన్మదినం, ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవంను శుక్రవారం నియోజకవర్గ కేంద్రం వేమురులో ఘనంగా నిర్వహించారు. మాదిగలలో సామాజిక చైతన్య నింపేటమే కాక ఉమ్మడి ఆంధ్ర రాజధాని హైదరాబాద్‌లో ఎంఆర్‌పిఎస్ ప్రభంజనం సృష్టికర్త మంద కృష్ణమాదిగ అభినందనీయులని కొనియాడారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్‌కు జనసేన పార్టీ మద్దతు తెలిపింది. దీనిని పురస్కరించుకొని వేమూరు ప్రాథమిక పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షురాలు అనురాధ, వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు యల్లమాటి దాసు, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సమావేశం

ప్రజాశక్తి-కొల్లూరు

వాలంటీర్లు ఇంటింటి సర్వే నూరు శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో ఐ సత్యనారాయణ చెప్పారు. కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 18న కొల్లూరులో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి సర్టిఫికెట్లు అందించడంలో అవకతవకలు జరగకూడదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు.



విత్తనాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

నాణ్యమైన విత్తనాలనే సాగు చేసుకోవాలి

ప్రజాశక్తి-కొల్లూరు

వరి రైతులు నాణ్యమైన విత్తనాలనే సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వరరావు చెప్పారు. కొల్లూరులో రైతులకు అందించే వరి విత్తనాల షాపులను శుక్రవారం శాంపిల్స్ పరిశీలించారు. విత్తనాలను ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం మొలక శాతం తేడా ఉన్నట్లు తేలితే ప్రభుత్వ నిబంధన ప్రకారం విత్తనాల కంపెనీలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు.

డాక్టర్ నాగార్జునగౌడ్‌పై ఆరోపణలు అవాస్తవం

డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగార్జున గౌడ్‌పై ఎఎన్ఎం ఆంబోతు దేవికాభాయి చేసిన ఆరోపణలు అవాస్తమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగార్జున గౌడ్ పై అదే ఆరోగ్యకేంద్రంలోని నాయుడుపాలెం సచివాలయంలో ఎఎన్ఎం గా పనిచేస్తున్న ఆంబోతు దేవికాభాయి చేసిన లైంగిక ఆరోపణలపై.. కలెక్టర్ సూచనల ప్రకారం మార్కాపురం జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి విచారణ జరిపారన్నారు. ఈ నెల 3న పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నాయుడుపాలెం సచివాలయంలో ఎఎన్ఎం గా పనిచేస్తున్న ఆంబోతు దేవికాభాయి అదే సచివాలయంలో జరిగిన గొడవలతో ఈ మె అక్కడ ఉన్న ఆశా వర్కర్లు ఎస్.కె. జాన్ బి, పెద్ద వెంకటమ్మ, సిహెచ్ఒ పి. భవాని, ఆరోగ్య పర్యవేక్షకులు సమక్షంలో చిన్నపిల్లలకు వాడే యాంటీ బయో టిక్ సెప్ట్రాన్ సిరప్ బాటిల్‌లోని 50 మిల్లీ లీటర్లు మందులో సగంవరకు మాత్రమే తాగిందన్నారు. ఆమెను యర్రగొండ పాలెం ఏరియా ఆసుపత్రిలో చేర్పడంతో సెప్ట్రాన్ సిరప్ ను తాగినట్లు చెప్పిందన్నారు. అప్పుడు ఆమె ఆరోగ్య పరిస్థితి కేసు షీట్ ప్రకారం నిలకడగా ఉందన్నారు. మార్కాపురం జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారి విచారణలో తాను ఐదు సెప్ట్రాన్ సిరప్ బాటిల్స్, ఒక అల్బెండోజోల్ మాత్రను తీసుకున్నట్లుగా చెప్పిందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా వారు ఏమి తీసుకున్నారని ప్రశ్నించినపుడు పాయిజన్ తీసుకున్నట్లు, పుల్లలచెరువు వైద్యాధికారి డాక్టర్ నాగార్జున లైంగిక వేధింపులతో తాను ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు తెలిపిందన్నారు. గతంలో చేసిన ఆరోపణలపై జూన్ 12న జిల్లా జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ విచారణ జరిపారు. మళ్లీ ఈనెల 3న జరిపిన విచారణలో నాయుడుపాలెం సచివాలయంలో ఎఎన్ఎం గా పనిచేస్తున్న ఆంబోతు దేవికాభాయి పుల్లలచెరువు వైద్యాధికారి డాక్టర్ నాగార్జున పై చేసిన లైంగిక ఆరోపణలు అవాస్తవమని తేలిందన్నారు. , ఈనెల 3వ తేదీ రాత్రి యర్రగొండ పాలెం లెం ఏరియా ఆసుపత్రి లో ఆమె పరిస్థితి నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ కావచ్చని డ్యూటీ డాక్టర్ కేసు షీట్ నందు రాసి ఉన్నార్నారు. అయినా ఆమె ఈనెల 5వ తేదీ వరకు ఇతర కారణాలతో ఆసుపత్రిలో ఉందన్నారు. ఈ విషయాలపై తదుపరి విచారణ జరిపి వారిలో ఎవరి తప్పు ఉంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఒ డాక్టర్ రాజ్యలక్ష్మి తెలియజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. పట్టణంలోని తూర్పువీధి ప్రాంతంలోని జువి చెట్టు వద్ద నుండి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, నాయకులు కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. తూర్పు వీధిలో జువి చెట్టు వద్ద వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించి, నాలుగేండ్ల పాలనలో అందించిన సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చరన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన అందిస్తున్నరన్నారు. నాలు గేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, వైసీపీని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు అందేలా చూడాలన్నారు. ప్రతి గడపలో ప్రజలు వైసీపీ ప్రభుత్వం పట్ల ఆధారాభిమానాలు చూపుతున్నారని ఎమ్మెల్యే కెపి సంతోషం వ్యక్తం చేశారు. ఒకటో వార్డు కౌన్సిలర్, నాయకులు ఎమ్మెల్యేను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమారి శ్రీనివాసరెడ్డి, వైసిపి నాయకులు గుంటక చెన్నారెడ్డి, ముత్తారెడ్డి వెంకట్ రెడ్డి, తాడిపత్రి చెన్నారెడ్డి, సూనె శివారెడ్డి, గోలమారి వెంకట్ నారాయణరెడ్డి, సిహెచ్ శ్రీనివాసులు, సిరాజ్, కౌన్సిలర్లు, తూర్పు వీధి వైసీపీ నాయకులు, పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

9న అండర్-19, 15 క్రికెట్ సెలక్షన్స్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు రోడ్డులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మినీ లార్డ్స్ మైదానంలో అండర్-19, 15,, సీనియర్ క్రికెట్ ఎంపికలు జరుగుతాయని కమిటీ కన్వీనర్ ఎం.వీర రాఘవరెడ్డి తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 21 నుంచి మంగళగిరిలో జరగనున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంఎస్పీ మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చెర్లోపల్లి, ఏకునాంపురం, అరివేముల, ముండ్లపాడు, డీజీ పేట, రెగులచెలక తదితర గ్రామాలలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు జెపీ.రాజ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు సంగటి ఐజాక్, శీను, రాంబాబు, ఆదాము పాల్గొన్నారు.

గర్భిణీపై వైసిపి నేతల దాడి

- 'సురక్ష'లో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ
- కుర్చీలు విసిరేసుకున్న వైనం

ప్రజాశక్తి-పిసిపల్లి

గర్భిణీ అని కూడా చూడకుండా వైసిపి నేతలు తనపై దాడి చేశారని ఓ దళిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. పిసిపల్లి మండలంలోని దివాకరపురానికి చెందిన దళితురాలు నీలం నరసమ్మ గర్భిణీ. రేషన్ కార్డుల పేర్ల మార్పు కోసం వాలంటీర్ శీలం మాధవి వద్ద వేలిముద్ర వేసేందుకు వెంగళాయపల్లి సచివాలయంకు గురువారం వెళ్లింది. అక్కడే ఉన్న వెంగళాయపల్లి పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి మాట్లాడుతూ నరసమ్మ కుటుంబీకులు మురికినీళ్లను పైపులైన్ లేకుండా సైడు కాలువలో నీటిని వదులుతున్నారని వేలిముద్ర వేయించుకోకుండా అడ్డు చెప్పారు. సైడు కాలువలో పైపులైన్ ఏర్పాటు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని, ఇంటి ఆవరణలో మురికి నీరు ఉంచుకోవద్దని అన్నారు. ఈ విషయమై శుక్రవారం నీలం నరసమ్మ కుటుంబం వెంగళాయపల్లి సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై గురువారం జరిగిన ఘటన గురించి అధికారులకు చెప్పేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వైసిపి నేత, మాజీ సర్పంచి శీలం సుదర్శనం మాట్లాడుతూ మీ సమస్యను తరువాత చర్చిద్దాం, కార్యక్రమాన్ని సాఫీగా సాగనివ్వండని అనడంతో నరసమ్మ కుటుంబీకులు తమకు ఇప్పుడే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై నరసమ్మ కుటుంబానికి, వైసిపి నేతలకు తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు కుర్చీలు విసిరేసుకున్నారు. ఈ నేపథ్యంలో గర్భిణీ అని కూడా చూడకుండా తనపై వైసిపి నేత శీలం సుదర్శనం, మరో నలుగురు దాడి చేశారని నరసమ్మ పిసిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వైసిపి నేతలు కూడా నరసమ్మ కుటుంబీకులు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. రెండు గ్రూపులు ఇచ్చిన ఫిర్యాదులపై సెక్షన్ 160 కింద కేసు నమోదు చేసినట్లు పిసిపల్లి ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

నేడు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-కొండపి

తెలుగుదేశం పార్టీ కొండపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం నాడు ఐటిసి కంపెనీ ఎదురుగా ఉన్న దామచర్ల కంపెనీలో జరుగుతుందని తెలుగుదేశం పార్టీ కొండపి మండల అధ్యక్షులు బొడ్డపాటి యలమందనాయుడు తెలిపారు. శుక్రవారం కొండపిలోని టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన యువగళం నియోజకవర్గంలోని పొన్నలూరు మండలంలోని మాలపాడు సమీపంలో ఈనెల 13 నుంచి 15 మధ్య చేరుతుందన్నారు. ఈ సందర్భంగా టిడిపి సమావేశం శాసనసభ్యులు స్వామి, దామచర్ల సత్య సారథ్యంలో జరుగుతుందన్నారు.

ఆసుపత్రిలో ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేయాలి

ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా అవసరాలు, ఆసుపత్రిలో రోగుల అవసరాల దృష్ట్యా ఆసుపత్రిలో ఆర్వోప్లాంటు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం నాడు పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యంపిపి కొండసింగు స్వప్న కుమారి ఆధ్వర్యంలో ఆసుపత్రి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఆసుపత్రి నిధుల నుంచి కొన్ని తీర్మానాలు చేయడం జరిగింది. ఈ తీర్మానంలో రోగులకు అవసరమైన త్రాగునీరు, ఆసుపత్రిలో కాన్పు సమయంలో ఇన్వేటర్ అవసరాలను గుర్తించారు. ఆరోగ్య కమిటీ సభ్యులు సమావేశంలో పలు తీర్మానాలు ప్రతిపాదించడం జరిగింది. సమావేశంలో తహశీల్దారు పి.సింగరావు, యంపిడివో యం.వి. రమణమూర్తి, పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పి.అనూషా, యంవో, ఝాన్సీరాణి, ప్రియాంక, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎస్.కృష్ణమరాజు, సిహెచ్‌వో పి.అనిల్‌కుమార్, ఎల్‌డిసి కాంతారావు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి స్వప్నకుమారి

'మనువాదం' మహిళల మనుగడకు ప్రమాదం

- యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.ఉమామహేశ్వరి
- ఉత్సాహంగా ఐద్వా జిల్లా స్థాయి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మనుధర్మ శాస్త్రంలోని సనాతన సాంప్రదాయాలు మహిళల మనుగడకు అడుగడుగునా అడ్డుపడుతున్నాయని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం జరిగాయి. శిక్షణ తరగతులకు ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు నెరుసుల మాలతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి మాట్లాడుతూ బాల్యవివాహాలు, సతీసహగమనాన్ని, వరకట్నం వంటి దురాచారాలను పాటించటమే అత్యున్నతమైన ఆచారమని మనుధర్మశాస్త్రం దేశ ప్రజల బోధిస్తోందని విమర్శించారు. అనేకమంది పురుషులు, మహిళా యోధులు చేసిన పోరాటాల ఫలితంగా ఇటువంటి దురాచారాలు ఒక్కొక్కటి అడ్డుకొని వాటిని పాటించరాదని చట్టాలు చేయబడ్డాయన్నారు. వితంతువు పునర్వివాహాలు, సామాజిక సమానత్వం వంటి హక్కులు, కొన్ని చట్టాలు సాధించబడ్డాయన్నారు. స్త్రీని వంటింటికి, పడకగదికి పరిమితం చేసిన మనుధర్మ శాస్త్రాన్ని పాతేసి, ప్రజాతంత్ర, అభ్యుదయ భావాలను సమాజంలో పరిఢవిల్లేలా స్వాతంత్ర్యానికి పూర్వమే అనేక ప్రజాఉద్యమాలు సాగాయని వివరించారు. అటువంటి పోరాటాల ఫలితంగానే సనాతన సాంప్రదాయాలను మట్టుపెట్టి సామాజిక సమానత్వంలో భాగంగా మహిళలకు చదువుకునేందుకు, ఉద్యోగాలు చేసేందుకు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజకీయాల్లో పాల్గొనేందుకు అవకాశాలు కల్పించబడ్డాయన్నారు. స్వాతంత్ర్యం అనంతరం స్త్రీలపై జరుగుతున్న హింస, వరకట్న వేధింపులకు వ్యతిరేకంగా 498ఏ, నిర్భయ, దిశ వంటి అనేక చట్టాలు సాధించబడ్డాయని తెలిపారు. ఈ చట్టాలను పాలకులు సమర్థవంతంగా అమలుచేయకపోవడం, పురుషాధిపత్య భావజాలం బుర్రల్లో గూడు కట్టుకొని ఉండటంతో నేటికీ హింస, వేధింపులు హత్య, అత్యాచారాలకు మహిళలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చాక ఈ హింస, దౌర్జన్యాలకు తోడు, అనాగరికమైన మనుధర్మ శాస్త్ర భావజాలాన్ని నెత్తికెత్తుకొని పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి సనాతన సాంప్రదాయాలపై సమరం సాగించేందుకు మహిళా సంఘాలు, ప్రజాతంత్ర వాదులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జివి కొండారెడ్డి మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న సంస్కరణలతో మహిళల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయన్నారు. 'సరళీకరణ విధానాలు-మహిళలపై ప్రభావం' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనే విధానాలు సంపన్నులకు మరింత సంపదను కూడా పెడుతూ సామాన్యులను పాతాళానికి తొక్కేవిధంగా సాగుతున్నాయని విమర్శించారు. ఈ విధానాలతో మహిళలు ఉద్యోగ భద్రత తో పాటు జీవన వ్యయం విపరీతంగా పెరిగి కుటుంబ జీవనం అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి గత కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. హాజరైన కార్యకర్తలందరూ వాటిని చర్చించి కర్తవ్యం రూపొందించుకున్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు జి.ఆదిలక్ష్మి, బి గోవిందమ్మ, బి రాజ్యలక్ష్మి, అంగలకుర్తి మాధవి, ఏ.విశ్రాంత, కె.రాజేశ్వరి, బి.పద్మ, కె. అనంతలక్ష్మి, బి పెద్ద గోవిందమ్మ, అబ్బూరి బసవమ్మ, ఎ.రమణమ్మ, ఏ.పరిమళ, మల్లెల నిర్మల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి